కథ

# పునరపి జననం



ప్రతాప వెంకట సుబ్బారాయుడు
సెల్: 9393981918

*దేవుడు చచ్చిపోయాడు*

*వున్నాడో లేడో తెలియని దేవుడు చనిపోయాడని చెప్పడమేంటని మీ డౌటు కదా. దేవుడు చచ్చిపోయాడన్నది నిజం!*

*అసలు దేవుడంటే ఎవరు? అందర్నీ సమదృష్టితో చూస్తూ.. కామక్రోధ మదమత్సరాలు లేకుండా ఆపన్నులని ఆదుకుంటూ.. స్వార్థం అనేది ఇసుమంతైనా లేకుండా సర్వప్రాణులని సమానంగా చూడగలగడమే దైవత్వమైతే పరంధామంగారు దేవుడే! ఆయనే ఇప్పుడు చనిపోయారు. సరంధామం గారు, నేను చాలాకాలం నుండి స్నేహితులం. స్నేహితులమంటే అరెయ్..ఒరెయ్ అనుకోవాలి గాని "గారూ" అంటున్నానేమిటని మీరు ఆశ్చర్యపోవచ్చు. కాని ఓ దుర్మార్గుడ్ని గురించి చెప్పాల్సి వస్తే 'వాడూ వీడూ' అంటాం. మరి ఓ మంచి వ్యక్తిని గురించి చెప్పాలంటే 'గారూ' చేర్చడం సముచితమే కదా!*

*ఆయన గురించి నాకు తెలిసినంత కాకపోయినా మీకూ కొంత తెలియాలంటే గతంలోకి మిమ్మల్ని తీసుకెళ్ళాలి.*

........

నేను చదువుకునే రోజుల్లో మా స్కూల్లో కొత్తగా చేరాడు పరంధామం.

బాల్యంలోంచి కౌమారంలోకి అడుగెడుతూ మనిషికుండాల్సిన మకిలి లక్షణాలన్నీ అప్పుడప్పుడే వంటపడుతున్న దశ. పరంధామం మా తరగతిలో కొత్తగా చేరి నా పక్కనే కూర్చున్నాడు. నేను బెంచి మీద కాస్త విశాలంగా కూర్చుని నా ఆధిపత్యాన్ని నిరూపించుకున్నాను. పరంధామం బెంచి మీద ఒద్దికగా ఒక పక్కకి చాలీచాలకుండా కూర్చున్నాడు. అంతే కాదు ఆ ముఖంలో కోపపు ఛాయలు కాని, గొడవ పెట్టుకోవాలన్న ఉద్దేశం కాని కనిపించకపోవడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. మా తరగతిలో వున్న పిల్లలందరం గడుగ్గాయలమే! కాని వీడేంటి కాకుల మధ్య కోకిలలా? ఆ తర్వాత వాడిని కవ్వించడం.. రెచ్చగొట్టడం.. ఇత్యాది కార్యక్రమాలెన్నో చేపట్టాను. ఊహూ.. వాడిలో చలనం లేదు. మాకు దగ్గర్లోని తోటల్లోకి జొరబడడాలు.. కాయలు పండ్లూ దొంగతనం చేసి తినడాలు.. పరీక్షల్లో కాపీ కొట్టడాలు ఇవేవీ వాడు చేసేవాడు కాదు. మా వయసులో సహజంగా చేసే అల్లరి వాడిలో మచ్చుకైనా కన పడేది కాదు. పోనీ వాడి బుర్ర ఎదగలేదా అంటే పాఠాలు శ్రద్ధగా వినడం, మాస్టర్లు అడిగిన వాటికి చక్కగా సమాధానాలు చెప్పడం. మాస్టర్లు రాని ఖాళీ సమయాల్లో చదువులో వెనుకపడిన పిల్లలకి అర్థమయ్యేలా పాఠాలు చెప్పడం చేసేవాడు. పోనీ అవన్నీ పేరు కోసమూ, మాస్టర్ల ప్రశంసల కోసమూ అనుకుంటే అది వేరే విషయం. కాని ఎవరికీ తెలిసేలా చేసేవాడు కాదు. వాడిని శ్రద్ధగా గమనించడం అప్పటినుండే అలవడింది. వాడి గొప్పతనం, ఔన్నత్యం గుర్తించాక నేను ఒదిగి కూర్చుని వాడికి బెంచి మొత్తం ఇచ్చేశాను.

వాడితోపాటు ఒకసారి వాళ్లింటికి వెళ్లిన నాకు మరో ఆశ్చర్యకర విషయం తెలిసింది. సాధారగా ఇలాంటి పిల్లల తల్లిదండ్రులు చాలా బీదగా వుంటారు. 'లేమి' వీళ్లని అలా 'నెమ్మదిగ' చేస్తుందనుకునేవాణ్ణి. కాని వాళ్ళు బాగా ఉన్నవాళ్ళు. వాళ్ల నాన్న ప్రభుత్వ ఉద్యోగంలో మంచి స్థాయిలో వున్నారు. ఇల్లంతా నౌకర్లు, చాకర్లు.. బయట రెండు కార్లు. మా నాన్న పోయిన నెల సైకిల్ కొనడానికి తల్లడిల్లిపోయాడు. నేను వాడితో వాడింట్లోకి అడుగు పెట్టగానే వాళ్ల నాన్నా, అమ్మా సోఫాల్లో కూర్చుని వున్నారు. వాడు వాళ్లకి నన్ను పరిచయం చేసి కూర్చోమన్నాడు. వాళ్ల ఆస్తీ అంతస్తుకీ, వీడి ప్రవర్తనకి పొంతన కుదరక షాకవుతూ "మీరు ఇంత డబ్బుండి మీ అబ్బాయిని ఒక మామూలు ప్రభుత్వ పాఠశాలలో చదివించడం నేను నమ్మలేకపోతున్నాను" అన్నాను. దానికి వాళ్లు బాధగా "ఏం చెప్పమంటావు బాబు.. వాడికి ఊహ తెలిసినప్పటి నుంచి

భేషజాలు గిట్టవు. మనిషి విజ్ఞానవంతుడవడానికి చదువు అవసరమే! కాని అది డబ్బు పెట్టి కొంటేనే వస్తుందనుకోవడం భ్రమ. సాధారణ పాఠశాలలో చదివినా కోట్లు పెట్టి చదివినా ఒకటే! కావలసిందల్లా ఆసక్తి. కాబట్టి నేను ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతాను అని పట్టుబట్టి మరీ మీ స్కూల్లో చేరాడు" చెప్పారు. నేను మంచి కాన్వెంట్‌లో చదువుతానని మారాం చేస్తే మా అమ్మతో నాన్న తన అశక్తతని వ్యక్తపరుస్తూ బాధపడడం గుర్తొచ్చి కళ్ళనీళ్ళు నిండాయి. "స్కూలు ఏదయితేనేం మా అబ్బాయి బాగా చదువుతున్నాడు. మాకది చాలు." అని "బాబూ నీ రూం మీ ఫ్రెండ్‌కి చూపించు" అన్నారు. పరంధామం నన్ను వాడి గదిలోకి తీసుకెళ్ళాడు. వివేకానందుడు.. రామకృష్ణ పరమహంస.. మహాత్మాగాంధీ.. మదర్ థెరిసా.. మహానుభావులకి సంబంధించిన రచనలన్నీ పొందికగా షెల్ఫ్‌లో అమర్చివున్నాయి. "నువ్వు ఇవన్నీ చదువుతావా?" ఆశ్చర్యంగా అడిగాను. సమాధానంగా చిన్న నవ్వు నవ్వాడు. నాకు ఆటబొమ్మలతో.. అట్టలూడిపోయిన పుస్తకాలతో అస్తవ్యస్తంగా వుండే మా గది గుర్తుకొచ్చింది. 'నీ పుస్తకాలు శ్రద్ధగా పెట్టుకోవాలిరా' అని నిరంతరమూ బాధపడే అమ్మ గుర్తుకొచ్చింది. వాడో మహానుభావుడు (నా దృష్టిలో) అని అప్పుడే అర్థమైంది. అప్పటి నుండి వాడిని మీరు అని సంబోధించడం మొదలెట్టాను. వాడు ఆ తేడా గమనించి సున్నితంగా తిరస్కరించాడు. కాని నేను మొండిగా అలాగే పిలుస్తానన్నాను. వాడి చిరునవ్వే సమాధానమైంది.

మా నాన్నకి నన్ను చదివించే స్థోమత లేకపోయినా అప్పులు చేసి కార్పొరేట్ కాలేజీలో పై చదువుల కోసం చేర్పించాడు. అక్కడ అహర్నిశలు చదువు.. చదువు.. గానుగెద్దు జీవితంలో రోజులు దొర్లిపోయాయి. తద్వారా ఇంజినీరుగా స్థిరపడ్డాను. పరంధామంకి చదువుకునే స్థోమత వున్నా సాధారణంగానే చదువుకుని మామూలు ఉద్యోగంలో చేరాడు. ఆయనకి నాకు తేడా ఏమిటంటే? ప్రశాంతత. ఎప్పుడూ ఏదో కొంప మునిగిపోతున్నట్టు నేనుంటే.. మనశ్శాంతితో ఒక బాబాలా (సోకాల్డ్ కమర్షియల్ బాబా కాదు) వుంటాడు. వారంటే నాకు చాలా గౌరవం. నేను ఆయనా ఒకటే కాలనీలో వుంటాం. నా పొజిషన్ని కట్నం డబ్బుతో తూచి నన్ను అల్లుడ్ని చేసుకున్నాడు ప్రభుత్వ శాఖలోని ఓ బడాబాబు. మా నాన్నకి అదిచ్చిన ఆనందం అంతాఇంతా కాదు. అందరూ కొడుకుని గొప్ప ప్రయోజకుడిని చేశావని పొగుడుతుంటే ఆ కళ్ళలో ఆనందబాష్పాలు నదులయ్యాయి. నిజమైన జీవితం ఇది కాదని నాకు తెలుసు కాని ఏదో తెలియని అశక్తత ఎప్పటికప్పుడు నన్ను స్వాధీనపరుచుకుంటుంది. పరంధామం తన ఆలోచనలకి అనుగుణంగా ఓ మంచి అమ్మాయిని నిరాడంబరంగా పెళ్ళి చేసుకున్నాడు. వాడింట్లో ఏ ఖరీదైన వస్తువూ వుండదు. మా ఇంట్లో అన్నీ వున్నా ఏదో వెలితి. నాకు బీపీ.. మా ఆవిడకి షుగరు.. లేచిన దగ్గర నుంచి మందులు.. మందులు.. వాళ్ళింట్లో పరంధామంగారు రోగాలకి మందులేసుకోవడం ఏనాడూ చూడలేదు. నాకు ఇద్దరు ఆడపిల్లలు. పెద్దమ్మాయికి కళ్ళజోడు వచ్చేసింది. చిన్నమ్మాయి బాగానే వుంటుంది. కాని ఎప్పుడూ చిరాకే! పరధామం గారికి ఒక కొడుకు, కూతురు. పరంధామం గారి పిల్లల్ని చూస్తే రత్నమాణిక్యాలు గుర్తుకొస్తాయి. ఆపాదమస్తకం అణకువ. ఎదుటి వాళ్ళపట్ల గౌరవ మర్యాదలు.. తేడా నాకర్థమయిందేమిటంటే మాకు మా గురించి ఆలోచించుకోవడానికే టైముండదు, అలాంటిది పిల్లల గురించి ఏమి ఆలోచిస్తాము? వేలకు వేలు పోసి చదువు చెప్పిస్తున్నామనుకుంటాము కాని ఆలన.. పాలన.. లాలన.. చూడము. దాంతో మా మధ్య కృత్రిమత్వం చోటు చేసుకుంటుంది. తోటమాలి నిర్లక్ష్యం వహిస్తే మొక్కలు ఏపుగా.. ఉపయోగపడే విధంగా ఎలా పెరుగుతాయి? మా ఆవిడ కూడా అంతే ఏదో భార్యాభర్తలమైనందుకు ఒక రూఫ్ కింద వుంటాము కాని తన స్వేచ్ఛ తనది. దాంట్లోకి నాకు కూడా ప్రవేశం రెస్ట్రిక్టెడ్. దూరపుకొండలు నునుపు అన్నట్టు ఓ పోష్ ఏరియాలో ఆకాశహర్మ్యంలా భాసిల్లే మా ఇంటిని చూస్తే ముచ్చటేస్తుంది కాని లోపలన్నీ అడ్డుగోడలే! పరంధామం గారిది అలాకాదు.. సింగిల్ బెడ్రూం అద్దె ఇల్లు. ఒకళ్ల అవసరాలు ఒకరు చూసుకుంటూ కలిసిమెలసి జీవిస్తారు. వుండడం కోసం పేరుకు ఇల్లు కాని.. నిజానికి వాళ్లకి సమాజమే ఇల్లు. వాళ్ళున్న చోట బాధలు భయాలు వుండవు. కష్టమొచ్చినప్పుడు "నేనున్నాను" అన్న భరోసా ఆ ఇంట్లోని ప్రతి ఒక్కరూ సమాజంలోని బాధల్లో వున్న ప్రతి ఒక్కరికీ ఇస్తారు. మాకు ఎప్పుడూ అభద్రతా భావం. రేపన్న రోజు ఈ స్టేటస్ వుంటుందో వుండదో అన్న బెంగ. ప్రాణం నిలవడానికి గుప్పెడు మెతుకులు.. కట్టుకోవడానికి సాదాసీదా బట్టలు.. ఉండడానికింత నీడా తప్ప ఇంకేం కావాలి? మరి మనిషెందుకు ఇంతగా దిగజారిపోతున్నాడు? ఆయన్ని చూస్తే ఏ పరమాత్ముడినో చూసిన అనుభూతి. ఆయన సమక్షంలో ప్రశాంతతతో కూడిన అలౌకిక ఆనందం. అందుకే వీలయినప్పుడల్లా ఆయన్ని కలిసి మనసు తేలిక చేసుకుంటుంటే అశనిపాతంలాంటి ఈ వార్త. దేవుడు చచ్చిపోయాడు.

.....

నేను వాళ్లింట్లోకి వెళ్లేసరికి వసారాలో టెంట్ వేసి పరంధామం గారిని పడుకోబెట్టారు. ముఖం చావుకళ లేకుండా ప్రశాంతంగా వుంది. వుండదూ మరి! ఆయనకి వ్యక్తులతో భవబంధాలు లేవు. అందరూ ఆయన సంబంధీకులే! విషయం తెలిసిన ప్రతి ఒక్కరు గుండెలు బాదుకుంటూ ఉప్పెనలా తరలి వస్తున్నారు. మనిషి చనిపోతే మోసేవాళ్ళు నలుగురుండాలట. కాని ఈ జన సంద్రమేమిటి? ఆయన్ని ఎంతలా మమేకం చేసుకుంటే అది సాధ్యమవుతుంది? తన జీవితాన్ని సుఖాన్నీ, సంతోషాన్నీ పణంగా పెట్టి ఆస్తులు కూడబెట్టుకోలేదు.

అన్యాయం అక్రమం, అవినీతి అన్నది ఆయనకి తెలియదు. సమాజ సేవ చేయడానికి రాజకీయ పదవి కోసం అర్రులు చాచలేదు. సన్యాసి దుస్తులు ధరించి ఎకరాలకెకరాలు ఆక్రమించి ఆశ్రమాల పేరిట కంచుకోటలు కట్టుకుని డబ్బు సంపాదించలేదు. తన రక్త సంబంధీకులకి, ఇతరులకి కూడా తేడా చూపని జీవితం. మనుషుల మధ్య మలినమంటని పవిత్ర జీవితం గడిపారు. ఈ ప్రపం చ నాటక రంగస్థలం మీదకి ఒక పాత్రలా వచ్చాడు.. పరిపూర్ణంగా తన పాత్రని తీర్చిదిద్దుకున్నాడు. తన వాళ్ళని దిక్కు లేని వాళ్ళని చేసి వెళితే దిగులు.. కాని వాళ్ళని తన వాళ్ళ మధ్య వదిలి వెళితే ఇంక విచారమెందుకు? అందుకే ముఖంలో ఆ ప్రశాంతత! తమకి కష్టమొస్తే కాకుల్లా కలసి అందరూ సహాయం చేయాలి.. అదే తన అవసరం ఎవరికన్నా వస్తే తామరాకు మీద నీటిబొట్టులా దూరమవ్వాలి.. ఇలాగా మనిషి జీవించాల్సింది? కాదు ముమ్మాటికీ కాదు! ఆయన్ని ఎంతో దగ్గరగా గమనించాను. కానీ ఆయన్నెప్పుడూ అనుసరించలేదు. మనుషుల్లో మానవత్వం అంతరించిపోకూడదనుకుంటే 'మనిషి కోసం మనిషి' అన్న సూత్రం చాలా గొప్పది. నేను తనవ్వడానికి ప్రయత్నించాలి. దానికి నాకున్న కృత్రిమ బంధాలు ఆయన పవిత్ర ఆత్మ నా ఆత్మని ప్రక్షాళన చేసి నా ద్వారా మళ్లీ పునర్జీవించింది.

# సమైక్య గీతం

– మాధవీ సనారా

9440103134

**మనమంతా తెలుగులం - ఈ దేశపు వెలుగులం**
**అవిభాజ్య ఆంధ్ర దేశమందునున్న ప్రజలం**
**సీమలోనైనా - కోస్తాలోనైనా**
**తెలంగాణలో నైనా - ఉత్తరాంధ్రలోనైనా**
**రాసేది తెలుగు - మాట్లాడేది తెలుగు - మనం**
**రాజ్మహేంద్రమున నన్నయ తెనుగులోనె రచించాడు**
**తెలంగాణలో పోతన తెనుగులోనె రాశాడు**
**తెలంగాణలోనైనా , సీమాంధ్రలోనైనా**
**అన్నిచోట్ల నినదించిన దొకె తెలుగు ఒకే వెలుగు**
**శ్రీరాములు అమరుడై ఏకం చేసిన నేల**
**కృష్ణదేవరాయలు కావ్యాలు వెలార్చిన నేల**
**ఆంగ్లేయులనే గడగడలాడించిన తెలుగునేల**
**ఎవడో రేపిన చిచ్చుకు మనం వేరుపడనేల?**




అనకాపల్లి సాహితీ మిత్రుల సమైక్య నినాదం